# వడ్డెర చండీదాస్:
# దర్శనమూ సాహిత్యమూ

అడ్లూరు రఘురామరాజు

ఎమెస్కో

## విషయసూచిక


| | | |
|---|---|---|
| | నేను చెప్పగలిగిన మాట : *వాడ్రేవు చినవీరభద్రుడు* | 7 |
| | కృతజ్ఞతలు | 10 |
| | ఉపోద్ఘాతం | 13 |
| 1. | సాహిత్య రచనలపై విమర్శనాత్మక సమీక్ష | 29 |
| 2. | దర్శన గ్రంథంపై విమర్శనాత్మక సమీక్ష | 56 |
| 3. | *హిమజ్వాల:* వ్యక్తి-సమష్టివాదం; *అనుక్షణికం:* విరసం విమర్శ | 87 |
| 4. | నీతి, అవినీతి, నీతిముందు | 115 |
| 5. | స్వప్న రాగలీన సౌందర్యం వెనక దాగిన కామరాహిత్యం | 143 |
| | సారాంశం | 164 |
| | ఆధారగ్రంథాలు | 167 |

# ఉపోద్ఘాతం

**వ**డ్డెర చండీదాస్ సాహిత్యం చదివి ఆస్వాదించి, ఆనందించి, తన్మయత్వం పొందే పాఠకులకు ఈ నా విమర్శ గ్రంథం ఉపయోగపడకపోవచ్చు. యిలాంటి అనుభవాన్ని ఆస్వాదిస్తూ ఆ తన్మయత్వంలో వూగుతూ కొందరు ఆత్మీయపాఠకులు వారి అనుభవాల్నీ, అనుభూతుల్నీ వివిధ పత్రికల్లో ప్రచురించారు. ఈ మానసిక స్థితిలో, ఆయన రచనల్లో కొన్ని విషయాలు వారికి అంత స్పష్టంగా కనిపించకపోయి వుండొచ్చు. దీనికి ప్రధాన కారణం చండీదాస్ రచనల్లోని భావ తీవ్రత. అలాంటి సందర్భాల్లోని వారి అభిప్రాయాల్ని విమర్శకోసం, ఈ పుస్తకంలో సరిదిద్ది, లోపాల్ని ఎత్తి చూపే ప్రయత్నం చేశాను. ఈ రచనలోని విషయాల్ని, పాత్రల్ని, వారి మధ్యగల సంబంధాల వెనుక దాగిన వ్యాకరణం, క్షేత్రగణితం, స్వరూప స్వభావాల్ని అధ్యయనం చెయ్యాలనే ఉత్సాహమున్న వారికి బహుశా ఈ పుస్తకం ఉపయోగపడొచ్చు.

## I

భారత ఉపఖండంలో రెండు మూడు శతాబ్దాలుగా కొత్తగా పరిపూర్ణ దర్శనగ్రంథం రాలేదు. చండీదాస్ రాసిన *డిజైర్ అండ్ లిబరేషన్: ది ఫండమెంటల్స్ ఆఫ్ కాస్మికాంటాలజీ* (1975) ('తృష్ణ–విముక్తి' 2011:61లో) ఈ శూన్యాన్ని పూరించింది. కాని దీన్ని చాలకాలంవరకు, బహుశా వలసవాద ప్రభావంలో వున్న మనం గుర్తించలేకపోయాం. అటు భారతదర్శనం, యిటు పాశ్చాత్యదర్శనశాస్త్రంలోని కొన్ని మౌలికమైన విషయాల్ని తిరస్కరించి కొత్త దార్శనికతను ఆవిష్కరించడం ఈ గ్రంథం ప్రత్యేకత. మన ఆలోచనల్ని పోషించే మూడు స్థితులున్నాయి. అవి: అస్తిత్వ పూర్వ స్థితి (ప్రీ ఎగ్జిస్టెన్స్), అస్తిత్వానంతర స్థితి (పోస్టు ఎగ్జిస్టెన్స్), అస్తిత్వరాహిత్యం (నాన్ ఎగ్జిస్టెన్స్). ఈ మూడు స్థితుల్ని అటు భారతీయ, పాశ్చాత్య దర్శనకారులు చాలామంది, బౌద్ధులు, చార్వాకులు మినహా అంగీకరించారు. బౌద్ధం అస్తిత్వం తరువాతి స్థితి, నిర్వాణాన్ని అంగీకరించింది. ఈ మూడు స్థితుల్ని చండీదాస్ తిరస్కరిస్తాడు. ఈ జగత్తుకు ముందు, తర్వాత, బయట ఏమీ లేదు. ఈ మూడు స్థితుల్ని ప్రతిపాదించింది నెగేషన్. ఈ మూడు స్థితులు సత్యాలు కావు. వీటిని సృష్టించింది నెగేషన్. దీనిని గుర్తించక ఈ స్థితుల్ని మనం సత్యాలుగా నమ్మాము. కానీ ఇవి సత్యాలు కావు.

అడ్లూరు రఘురామరాజు

ఈ మూడు స్థితులు మనకు శాశ్వతమైన (పర్మెనెన్స్), మార్పులకతీతమైన స్థితిని రూపొందించి తద్వారా నిరంతరం గమించే, చలించే ఈ విశ్వం అసలు స్వరూపాన్ని, తద్వారా తృష్ణనీ, అశాశ్వతాలుగా, అవాంఛనీయాలుగా ప్రకటించాయి. ఇలాంటి భ్రమలనుంచి బయటపడి నిరంతరం గతిశీలంగా ఉండే ఈ విశ్వాన్ని, దాని అసలు స్వరూపాన్ని గుర్తించాలి అనేది చండీదాస్ ప్రతిపాదన. ఈ నిరంతర గమనం హెగెల్, మార్క్స్ భావించినట్లు ఏకమార్గం కాదు. ఇది బహుమార్గాల విన్యాసాల కూటమి. నెగేషన్, పర్మనెన్స్‌ను సృష్టించి చలనాన్ని తక్కువ చేయడాన్ని తిరస్కరించి, జగత్తుకు నాడి 'వైరుధ్యత్వం' (కాంట్రడిక్షనరీనెస్ 2011: 31లో) అని ప్రతిపాదిస్తాడు.

ఈ రచయితలోని యింకొక విలక్షణ అంశం – దర్శనమూ, సాహిత్యమూ ఒకరిలోనే ఉండడం. ప్రపంచంలోనే ఇది చాలా అరుదు. ఆ వరుసలో జా.పా. సార్త్ర్ మొదటివాడైతే మన తెలుగువాడు చండీదాస్ రెండవవాడు[1]. గొప్ప క్రియేటివ్ రచయితలుంటారు. కానీ క్రియేటివిటీ, దార్శనికత ఒకరిలోనే వుండడం ప్రపంచంలోనే అరుదు. అలాంటి వారిలో జా.పా. సార్త్ర్ ఒకరు. శతాబ్దాల తర్వాత ఈ ఉపఖండంలోనే ఒక కొత్త, విప్లవాత్మక దర్శనశాస్త్రాన్ని, *డిజైర్ అండ్ లిబరేషన్: ది ఫండమెంటల్స్ ఆఫ్ కాస్మికాంటాలజీ* (1975) అనే దర్శనగ్రంథం ద్వారా సరికొత్త విప్లవాత్మకమైన దర్శనాన్ని ప్రతిపాదించినవారు చండీదాస్. ఈ అరుదైన గుణం వల్ల చండీదాస్ సాహిత్యరచనలు (నవలలు, కథలున్ను) అర్థం చేసుకోవడానికి ఆయన దర్శనగ్రంథాన్ని పరిగణనలోకి తీసుకుని అర్థం చేసుకోవాలి. ఎందుకంటే అతని తెలుగుసాహిత్య రచనలకు, ఈ ఇంగ్లీషు దర్శనగ్రంథం నేపథ్యాన్ని సమకూర్చుతుంది. అనుక్షణికంలోని పాత్ర శ్రీపతి విశ్వం అనంతరం అనే భావన నుండి; స్వప్న రాగలీన, గంగి పాత్రలు పశుత్వం సాధుత్వానికి వ్యతిరేకం కాదనే భావన నుంచి పుట్టివచ్చినవి. ఇలా చండీదాస్ దర్శనగ్రంథానికి ఆయన తెలుగుసాహితీ రచనలకు అవినాభావ సంబంధముంది. పాఠకులకు మరింత చేరువగా చేరగలిగిన ఆయన దార్శనిక శాస్త్రమే ఆయన నవలలు, కథలు. కాని, ఇది అన్ని విషయాలలో నిజం కాకపోవచ్చు. నవలలోని కొన్ని పాత్రలు తన దర్శన శాస్త్రం బయటవి కావచ్చు.

---

[1]శ్రీ అరవిందుల సావిత్రి ఈ కోవకు చెందినదే. సర్వేపల్లి రాధాకృష్ణన్ ది క్రైమ్ ఆఫ్ లీలా అనే నవలను మ్యాక్ మిల్లన్ ప్రచురణ సంస్థ ప్రచురించేందుకు అంగీకరించినా, తన పూర్తిపేరుకాక ఎస్.ఆర్. అనే పొడి అక్షరాల పేరుతోనే ప్రచురించాలి అనే నిబంధన పెట్టడం వల్ల ఈ నవల ప్రచురితం కాలేదు. (చూ. సర్వేపల్లి గోపాల్ 2016: 51–57). ఈ కోవకు చెందిన మరో దార్శనికుడు రామచంద్ర గాంధీ రచించిన సృజనాత్మక రచన ద మునియాస్ లైట్: ద నరేటివ్ ఆఫ్ ట్రూత్ అండ్ విల్, ట్రూత్, (2005)